# అందుకోలేని మెట్లు

రవిదీ నాదీ ఒక ఊరు కాదు. ఏ చుట్టరికమూ లేదు. ఇంటర్వ్యూ రోజున చూశాను. అప్పట్లో రాత పరీక్షలూ ఈ వడపోతలూ లేవు. అప్లికేషనులోని అర్హతలు చూసి పిలవడమే. ముఖాముఖీగా అడిగి తేల్చుకోవడం. అంతే. అంతా హాల్లో కూర్చున్నాం. అటెండరు పేరు పిలవగానే పోయి నాలుగైదు నిముషాల తర్వాత ఆ గదిలోంచి ప్రతి ఒక్కడూ బయట పడుతున్నాడు. అలా వచ్చినవాళ్ల వెంటపడీ, నేను ఇంకెవరినో కూడా అడిగి కొంత సమాచారం సేకరించాను. గదిలోని ముగ్గురూ ఆలిండియా సర్వీసెస్ వాళ్లట. ఇద్దరు తమిళులు, ఒకడు బీహారు వాడూనట.

నా ఎదుట కూర్చున్నవాడిని ఏ ఊరని అడిగాను. నాలో ఉన్నంత గాబరా వాడిలో ఉందో లేదో కానీ, కిటికీలోంచి ఎర్రపూల చెట్లవైపు చూస్తూ చిన్నగా ఏదో కూనిరాగం తీస్తున్నాడు. నావేపుకి తిరిగి 'అనకాపల్లి' అన్నాడు. రవీంద్రనాథ్ అని అటెండర్ పిలిచిన రెండో పిలుపుకి తేరుకున్న వాడిలా గదిలోకి వెళ్లి కాసింత ఆలస్యంగానే బయటికొచ్చాడు. వాడిని వెంబడించుదామనుకునే లోగా నాపేరు పిలవడంతో లోనికి వెళ్లాను. ఆ ముగ్గురూ నవ్వుల్లోంచి ఇంకా తేరుకోలేదు. తెలివి తక్కువ సమాధానమివ్వడమో, జోకు పేలడమో జరిగింది. నేను బయటపడ్డాక చూస్తే వాడులేడు.

ఆఫీసులో చేరమని రెండు నెలల తర్వాత పిలుపు రాగానే వెళ్లాను. వాడూ వచ్చాడు. మా కాగితాలు పరీక్షించి, వేరు వేరు విభాగాలకి విసిరినట్టు వేశారు. ఆఫీసులో మూడు నాలుగు పెద్ద పెద్ద భవనాలు. అందులోంచి మధ్యాహ్నం బిలబిలా వచ్చినప్పుడు క్యాంటీన్‌లోనే మేం కలవడం. అదేదో వాలాజా రోడ్డులో పారగాన్ థియేటర్ ప్రక్క సందులో ఒక గదిలో ఉంటున్నట్టు చెప్పాడు.

ఒక సాయంకాలం మెరీనా బీచ్‌లో తడిమట్టిమీద కూర్చుని కుడికాలు ముందుంచి పిచ్చుక గూడు కడుతున్నాడు. పక్కనే ఐదేళ్ళపాప నిలబడింది. అప్పుడే వీడికి పెళ్లీ, పిల్లానా అనుకుని వెళ్లి పలకరించి ఆ పాప ఎవరని అడిగాను. అదేమో, ఎవరో అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు. ఆ పాప తుర్రున దూరంగా పారిపోయింది. రవి చిన్నగా నవ్వి "నాకూ తెలీదు పిచ్చుక గూడు కట్టడం వచ్చా అంకుల్ అని తెలుగులో అడగ్గానే తెలుగుమాట విన్న సరదాలో గూడుకడుతున్నాను. అంతే" అన్నాడు. ఇంకా వాడిలో చిలిపితనం పోలేదనుకున్నాను.

గ్రామాల్లోంచీ, చిన్న ఊళ్లనుండీ వచ్చిన వాళ్లు మరీ పెద్ద పెద్ద భవనాలు, సెంట్రల్ స్టేషన్ చూడ్డానికీ అర్థంకాని తమిళభాష వినడానికీ, కలవరం నుండి తేరుకోడానికీ కొంత సమయం పడుతుంది. మా ఆఫీసు కూడా చాలా పెద్దదే. ఏడాది అవగానే మాకేదో పరీక్ష పెడతారట. అది పాసవగానే ఉద్యోగం స్థిరం చేసి, మూడు ఇంక్రిమెంట్లు ఇస్తారట. ఆ తర్వాత మూడేళ్లకి ఇంకో పెద్ద క్లిష్ట పరీక్ష రెండు భాగాలుగా ఉంటుందట. దాన్ని కూడా దాటేస్తే ఇక పెద్ద పాము గండం గడిచి ముందుకు సాగిపోవడమేనట. ఇంత సమాచారంతో చిన్న పరీక్షకి కావలసిన పుస్తకాలు కూడా సేకరించేశాను. అయితే నాతో వచ్చిన చిక్కంతా ఒక్కటే. రాచపీనుగ లాగ తోడులేకుండా నేను ఈ పరీక్షలు చదవలేను. ఏ పరీక్షలూ చదవలేను.

ఒక సాయంకాలం దడ దడ పెద్ద జల్లువస్తే తప్పించుకోడానికి మౌంట్ రోడ్డు పోస్టాఫీసులోకి చేరుకున్నాను. నాలాగే ఎక్కడనుండో వచ్చిన రవి ఉరఫ్ రవీంద్రనాథ్ వగరుస్తున్నాడు. మనమిద్దరం మొదటి పరీక్ష కలిసి చదువుదామా అని అడిగాను. ఆఫీసులో సంతకం పెట్టి పుస్తకాలు తెచ్చుకోవచ్చనీ, నేను అప్పుడే తెచ్చేసుకున్నాననీ చెప్పాను. సెంట్రల్ ట్రెజరీ కోడు, ఆడిట్ కోడు అని ఏకరువు పెడుతూ వాటిని

చూసి జవాబులు రాయవచ్చుట అని ఊరించాను. 'ఓ .... అల్లాగే' అన్నాడు రవి. అయితే ఈ ఆదివారం నేను నీ గదికి రమ్మన్నా వస్తాను, లేక నువ్వు నా దగ్గరకైనా రావచ్చు అన్నాను. ఈ ఒక్క ఆదివారం వద్దు. వచ్చే ఆదివారం నుండీ ప్రారంభిద్దామంటూ జేబులోంచి ఒక నీలి టిక్కెట్టు తీసి చూపించాడు. హిందూస్థానీ మ్యూజికల్ సొసైటీ అట. ఎవడో కలకత్తా నుండి విమానంలో విజయదశమి రోజునే వచ్చి పాడతాడట. అన్నామలై మన్రమ్‌లో అఘోరిస్తాడట. అంత అరుదైన అవకాశం మళ్లీ రాదుట. వాడి కళ్లు మరీ పెద్దవైపోయాయి, ఆ మాటలంటూ వుంటే. ఇక వీడితో నాకు కుదరదని నా లాడ్జిలోనే ఉన్న ఒక చిత్తూరు తెలుగు మాట్లాడే తమిళ కుర్రాణ్ణి ఆశ్రయించి ఆ చిన్న పరీక్ష దాటేశాను. పరీక్ష అనుకున్నంత కష్టం కాదు కానీ ఆ తర్వాతి పరీక్ష మాత్రం అంత తేలిగ్గా తీసుకోవలసింది కాదట.

ఏదో రాష్ట్రాల పునర్విభజన అన్నారు. హైదరాబాద్‌కి పంపించేశారు నన్ను. నాతో కలిసి చదివినవాడు ఎలాగో మద్రాసులోనే ఉండే ఏర్పాటు చేసుకోగలిగాడు. మూడేళ్లు ఇంకా పూర్తి అవకుండా రెండో పరీక్షకి కావలసిన పుస్తకాలన్నీ సేకరించి, ప్రతీరోజూ ఐదు గంటలవగానే ఇంటికి ఉరికి చదువు ప్రారంభించాలని నిశ్చయించాను. మా ఆఫీసుకి అధినేత అనబడే అకౌంటెంట్ జనరల్ ఎవడో ఛటర్జీ ఒరిస్సా నుండి కొత్తగా వచ్చాడట. చూడాలని ఉంది. చాలా హుందాగా ఉంటాడట. మేడమీద గదిలో ఉండేవాణ్ణి చూడాలంటే సులభం కాదు. మా సెక్షన్‌లోనే పనిచేస్తున్న వర్మ సాయంత్రం నన్ను నిలదీశాడు ఒకరోజు. "ఇవాళ మేం కొత్త అధికారితో పెద్ద కార్యక్రమం క్లబ్బుహాల్లో పెడితే నువ్వు ఎక్కడికి జారుకుంటున్నావ్. రేపటినుండీ చదువుకొందూగాని". అని ఇంటికి పోకుండా నిలిపేశాడు. అదే వేళకి ఒక పెద్ద వానజల్లు. సరే అని మా సెక్షన్ ప్రక్కనే ఉన్న క్లబ్బుహాల్లోకి పోయాను. కొత్త అధికారిని చూడాలని వచ్చినట్టున్నారు. ఇసుక వేస్తే రాలదు. వేదిక మీద అధికారితో పాటు ఇద్దరు అతిథులున్నారు. ఒకడు మహబూబ్ కాలేజీ ప్రిన్సిపాల్ కోటేశ్వరన్ అట. ఇంకొకడు కూడా నిజామ్ కాలేజీ ఇంగ్లీషు శాఖాధిపతిట. హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వోద్యోగుల్లో వక్తృత్వపుపోటీ అట. ఐక్యరాజ్యసమితి శుద్ధ దండగ అన్న ప్రతిపాదన మీద మాట్లాడాలి. ఆరుగురు మాట్లాడారు. ఇంకో ఇద్దరు పేరు ఇచ్చి

జారుకున్నారు. కనబడలేదు. "ఈ పోటీలోకి ఇప్పుడెవరన్నా శ్రోతల్లోంచి కూడా రావచ్చు" అని సెక్రటరీ అధ్యక్షుడి అనుమతితో ప్రకటించాడు. అప్పుడు మళ్లీ నా కళ్లపడ్డాడు రవి. వేదికమీదికొచ్చి మైకు పట్టుకున్నాడు. చిన్న జోకు పేల్చి నాలుగున్నర నిముషాలు ఏకధాటిగా మాట్లాడి ముగించాడో లేదో హాలంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది. బరువైన కాయాన్ని కుర్చీలోంచి లేవదీసుకున్న కోటీశ్వరన్ రవి భుజం తట్టి ........ అంతటి టాలంట్‌ని కార్యాలయంలో నింపుకున్నందుకు మా అధికారిని అభినందించి ప్రథమ బహుమతి ప్రకటించాడు.

మళ్లీ నాలో ఆశ రేగింది. రవితో చదివి ఈ క్లిష్టమైన పరీక్ష గట్టెక్కించాలని. పరీక్షకు వెళ్లి తప్పిపోయిన వాళ్లని చూస్తే ఆ వెధవ పరీక్ష మూకుడికి పట్టిన మసిలా సులభంగా వదిలించుకునేది కాదని తెలుస్తోంది. రవిని కలిసి అడిగాను. సరే అనడంలో ఢోకా లేదు.

ఒకరోజు తెగించి ఆదివారం నాడు వాడు చెప్పిన అడ్రసు పట్టుకుని ఆ లాయరింటి గేటులోంచి వెళ్లి ఆ ఇంటి వెనక్కు తిరిగాను. అది బ్రహ్మచారుల గదిలా లేదు. చిన్న కుటుంబం వుండే వాటా. గుమ్మం దగ్గర సందేహిస్తూ నిలబడ్డాను. ఒక అమ్మాయి సన్నగా పొడుగ్గా వెదురు మొలకలా ఉంది. చామనఛాయ. పెద్ద కళ్లు. సాదా నేత చీరలో వచ్చి నిలబడింది నాకెదురుగా. మెడలో కొత్త బంగారంలా మెరిసే పసుపుతాడు. కొత్త పెళ్లి కూతురా ? వీడికి పెళ్లి ఎప్పుడైంది ? నా మెదడులో ప్రశ్నలు. శుభలేఖ అయినా ఇచ్చాడా ? ఇంతలో ఎక్కడినుండో రవి వూడిపడ్డాడు. కొంత చదువు ప్రారంభించాం. కానీ వాడికి అంకెలంటే అసహ్యంలా వుంది. చాలా నిదానం. చీమ నడక. నేను ఎమ్.కాం. వాడిని. వాడిదేదో చరిత్రల చదువులా వుంది. వాడి భార్య ఇచ్చిన కాఫీ త్రాగి ఇంకో రోజు వెళ్లినట్టే వెళ్ళి నా దారి నే చూసుకొన్నాను. వాడితో పెట్టుకుంటే నేను వెనుక పడ్డం తప్ప ముందుకు సాగడం ఉండదు. లెక్కచేస్తూ దూరంగా ఏదైనా పాట వినిపిస్తే అలా ఆగిపోతాడు. చిత్రమైనవాడే.

ఆ తర్వాత ఒకమారు కనపడ్డా ఎందుకు రాలేదని వాడు అడగనే లేదు. ఆరేళ్ల కఠోర దీక్షతో - రెండుసార్లు పరీక్ష తప్పినా రెండు భాగాలూ పూర్తిచేసి నిలబడ్డాను.

అప్పట్లో పరీక్ష పాసయిన వాళ్లకు క్యూలూ, నిరీక్షణలూ లేవు. పాసు అయీ, అవగానే ప్రమోషన్ ఇచ్చేవారు. మా నాన్నగారితో కలిసి చదివిన స్నేహితుడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నాగార్జున సాగర్‌లో ఉన్నారు. మంచి అనుభవజ్ఞులు. హైదరాబాద్‌లో మైన్ ఆఫీసు పట్టుకుంటే ఏమి ఒరుగుతుంది. పే అండ్ అకౌంట్స్ ఆఫీసుకి డెప్యుటేషన్ పెట్టుకో అని సలహా ఇచ్చారు. ఇవ్వడమే కాదు, కొద్ది రోజుల్లో నాకు మామగారై కూర్చున్నారు కూడా.

పోనీ శుభలేఖ ఇద్దామని ఆ దారిని వెళ్తూ ఒకమారు రవికోసం లాయరింటికి వెళ్లాను. లాయరు భార్య కారు దగ్గర నిలబడి చూస్తూ "రవీంధ్రనాథ్ ఇంకెక్కడ? మా ఇంటి వెనక వాటా ఖాళీ చేసేశాడు" అని పెద్దగా క్లాసు తీసుకుంది. "అద్దెలకున్న వాళ్లు మా ఇంటి ముందునుండి అటూ ఇటూ తిరగడమెందుకని పెరటి వేపు చిన్న గేటు పెట్టించి ప్రక్క సందులోంచి రోడ్డుమీదికి పోయేలా ఏర్పాటు చేశాను. ఏమీ మాట్లాడలేదు. ఆత్మాభిమానమో, ఏమో నెల అవగానే వెళ్లిపోయాడు. అద్దెకున్న వాళ్లకే అంత ఉంటే మాకెంత ఉండాలి" అంది.

నాగార్జునసాగర్‌లో అద్దెలేని పెద్ద ఇల్లు - చుట్టూ మొక్కా మోడు వేసుకొనే సదుపాయం ఉంది. సిటీలో ఉండే అనవసరపు ఖర్చులూ, అడ్డూ ఆపూ లేకుండా వచ్చి పడే చుట్టాల రద్దీ లేకపోవడం, దగ్గరగానే అనుభవజ్ఞుడైన ఇంజనీర్‌గారూ - ఉండడం, పబ్లిక్ వర్క్స్ లెక్కలు మతలబులు కరతలామలకం అయిపోవడంతో ఐదారేళ్లు గడిచిపోయాక ఒకమారు హైదరాబాద్ వచ్చినా నీటిలోంచి తీసిన చేపలా అయిపోయాను. మళ్లీ శ్రీశైలం ప్రాజెక్టుకి వేయించుకోగలిగాను. అలా అక్కడ సబ్ డివిజనల్ అకౌంట్స్ చూస్తున్నప్పుడొకడు హెడ్ గుమస్తా - "మీది ఏ.జి. ఆఫీసా అయ్యగారూ ?" అన్నాడు. అవునన్నాను. నేనింకా సన్నిహితుడినయిపోయినట్లు అనుకున్నాడేమో 'మా బంధువు కూడా ఉన్నాడండీ' అన్నాడు. 'పేరు' ? అన్నానో లేదో, 'టీచరుగారి అబ్బాయి రవీ అండీ. పూర్తి పేరు రవీంద్రనాథ్. అనకాపల్లి స్కూల్లో మేం చదువుకన్నామండి. మాకు దూరపు బంధుత్వం కూడా ఉందండి" అంటూ రవి ప్రసక్తి తెచ్చాడు. నా నుదుట పడ్డ ముడతలు చూస్తూ "అయితే చాలా తిక్కమనిషండీ. ఇద్దరు మేనమామలు వాళ్లకి బోలెడు ఆస్తి. ఇద్దరేసి ఆడపిల్లలు

పెళ్లి కెదిగి ఉండీ నా కొద్దుపొమ్మని ఎవరూ ఎరగని అమ్మాయిని తెచ్చి పెళ్ళిచేసుకున్నాడు. అందరితో పేచీ, అయితే వాడి తల్లీ తండ్రీ ఎంతో మంచోరండీ. రవి ఎంత చెప్తే అంత అంటూ ఏవేవో చెప్పుకుపోయాడు అలా ఉండీ ఉడిగీ నా ఆలోచనల్లోకి వచ్చేవాడు రవి. చాలా చిత్రమే.

"మూడు రోజులు శలవలు. జీప్‌లో హైదరాబాదు వెళ్తున్నాను" అన్నాడు నాకు తెలిసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణరావు. అతని ప్రమోషన్‌కి హైదరాబాద్‌లో ఏదో కొంత ప్రయత్నం చెయ్యాలిట. బొంబాయిలో ఉన్న అతని తోడల్లుడు కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఎప్పుడో కారు చౌకగా జాగాలు దొరుకుతే హైదరాబాద్ పొలిమేరల్లో కొనిపడేశాడట. ఇప్పుడు రిటైర్ అయినాక అక్కడ పెద్ద మేడ కట్టించాడట. చూసి రావాలట. నన్ను కూడా తోడు రమ్మన్నాడు. నాతో మా అమ్మాయి కూడా వస్తానని పేచీ. "పోనీ తీసుకెళ్లరాదూ ! దానికి ఈ ప్రాజెక్టులో ఉండి ఉండి బోరు కొట్టి ఉంటుంది పాపం. నారాయణరావుగారి అమ్మాయి కూడా ఉంటుంది కదా" అని మా ఆవిడ సిఫార్సు. ఇక అలా జరగక తప్పదు కదా !

హైదరాబాద్‌లో కలవతగ్గ వాళ్లందరినీ కలిశాం. అబిడ్స్‌లో కొత్తగా కట్టిన షాపింగ్ కాంప్లెక్స్ చూస్తూ మేం పరాకుపడ్డ సమయంలో మా అమ్మాయి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు ఎవడో తెంపుకు పారిపోయాడు. పిల్ల భయంతో అదిరిపోయింది. కొత్తగా చేయించిన గొలుసు పోవడమే కాక పసిదాని మెడమీద రెండు కుట్లు పడ్డాయి. చుబుకం క్రింద డోక్కుపోయి ఎర్రగా కందిపోయింది. నా మనసు పాడైపోయింది. పిల్లకి బంగారు గొలుసెందుకే అంటే నా భార్య వినలేదు. బ్యాంకిలో డబ్బువేసి వెధవ ఇన్‌కంటాక్సు అంటూ చిరాకుపడ్డం దేనికి ? పిల్ల మెడ అలా బోసిగా ఉండకూడదంది. "అమ్మాయి భయపడింది కానీ గాయం ప్రమాదకరమైనదేం కాద"ని డాక్టరు భరోసా ఇచ్చాడు. ఆ సాయంకాలం కస్టమ్స్ ఇన్‌స్పెక్టరుగారి ఇంటికి చేరాక మా అమ్మాయిని వేగం నిద్ర పుచ్చేశాను. రాత్రి నాకు నిద్ర పట్టలేదు. కిటికీలోంచి గుడ్డి వెన్నెల్లో ఉన్న మైదానం చూస్తున్నాను. ఇన్ని సౌకర్యాలతో ఇంత పెద్ద మేడ ఈ మూల ఎందుకు కట్టినట్టు ? అద్దెలేమి వస్తాయి నా మొహం. జాగా చౌకగా వచ్చిందని కట్టేసి ఉంటాడు. అందులో

కష్టమ్సులో రిటైర్ అయినవాడు కూడా .......... అని సమాధానపరచుకుని కాసింత దూరంగా వచ్చిన రెండు ఇళ్లనీ ........ కొత్తగా వేసిన రెండు పునాదులనీ చూస్తున్నాను. అర్ధరాత్రివేళ అంకమ్మకు శివమెత్తిందన్నట్లు రాత్రి ఎక్కడో చిన్నగా పాట చెవిని పడుతోంది.

వేగమే నిద్రపోయిందేమో వేకువనే మా అమ్మాయి లేచి కూర్చుని నన్ను ఏమీ తోచక కదిలిస్తోంది. చల్లగాలికి బయట తిరుగుతున్నాం. మాతో కొంతదూరం నారాయణరావుగారి తోడల్లుడు వచ్చాడు. "నేను జాగాకొన్న రోజుల్లోనే ఆ చిన్న ఇల్లు కట్టేసుకుని ఎవడో అక్కడ ఆలుబిడ్డలతో ఉంటున్నాడు. సాహసమే. రాత్రి వాళ్లింటిలోంచి పాటలు వినిపిస్తూ ఉంటాయి" అని చెప్తూ ఎవరో పిలుస్తే వెళ్లిపోయాడు. నాలుగున్నర అంగుళాల ఆర్.సి.సి. పై కప్పు పలుచని గోడలు, చిన్న ఇల్లు, బావి, మొక్కా మోడు అదో చిన్న పర్ణశాలలా ఉంది. ఆ చెట్టుకింద రవి సరిగ్గా నా కళ్ల ముందున్నాడు. నేనూ రవీ బయట మాట్లాడుకోవడం చూసి రెండు కాఫీ కప్పులతో వచ్చింది వాడి భార్య. 'అమ్మాయిపాలు తాగుతుందా ?' అని అడుగుతూ మెడమీద ఎర్రని గాయపు చారలు చూసి కారణమడిగింది. అంతా చెప్పక తప్పలేదు. "ఆడపిల్ల మెడ బోసిగా ఉండకూడదనుకొంటే ఏదో సన్నటి తల వెంట్రుక లాటిది చేయించి వెయ్యాలి. సులభంగా తెగిపోతుంది. పోతే గొలుసు పోతుంది కానీ పిల్లలకు ప్రమాదం ఉండదు" అన్నాడు రవి బాధగా.

నా దృష్టివాడి దగ్గర ఉన్న పుస్తకాల మీద పడింది. వాడు చదువుతూ విడిచిన పుస్తకం పబ్లిక్ వర్క్సు అకౌంట్స్ కోడ్. ఇంకా నీ పరీక్ష పూర్తి కాలేదూ ? అని అడిగాను ఆశ్చర్యపోతూ "మొదటిభాగం రెండు మార్లుపోయాక ఇంక మానేద్దామనుకొంటూ ఆషామాషీగా రాస్తే మూడోసారి పాసయి కూర్చున్నాను. సగంలో విడవలేను, చదివే ఓపికా లేదు" అన్నాడు వేదాంతిలా నవ్వుతూ. ఆ పుస్తకం క్రింద పుస్తకాలు చూస్తే అయోమయం. అదేదో విల్‌డ్యూరాంట్ ఫిలాసఫీ చరిత్రట. రామరామా ! మధ్యలో ఇదెందుకూ ? అన్నాను. "ఈ అకౌంట్స్‌తో బోరు కొట్టినప్పుడు కాస్త మార్పు"గా అన్నాడు. వీడిని బ్రహ్మకూడా బాగు చెయ్యలేడనుకున్నాను. ఒక గదిలో పిల్లలిద్దరూ ఏదో పుస్తకాలు సర్దుకొంటున్నారు. రెండో గదిలో ఒక వారగా గోడకు దాపుపెట్టి

నిలిపిన దాన్ని చూసి ఈ వీణ ఎవరు వాయిస్తారన్నాను. అది విని పిల్లలెందుకో నవ్వారు. వాడి భార్య మాట్లాడలేదు. "ఏమీ తోచనప్పుడు మేం పాడుకొంటాము. ఈ తంబూర కాస్త శ్రుతి పెట్టుకుంటే...." అంటున్నాడు రవి. ఒక వరండా, కొట్టుగదీ ఇంకా గచ్చు చెయ్యలేదు. అలికి ముగ్గుపెట్టినట్టుంది. అలా కనపడ్డ రవి మళ్లా నా ఆలోచనల్లోకి చాలా రోజులక్కానీ రాలేదు.

రూల్స్‌లో వచ్చిన సడలింపు కారణంగా నన్ను ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్ మెంబరుగా గుర్తించి ఈశాన్య దిశగా విసిరివేశారు. ఒకరిద్దరు ఉన్నచోటు విడవలేక అలాటి ప్రమోషన్ వద్దని రాసిచ్చి నీళ్లు వదిలేసుకున్నారు. నేను మాత్రం వదల్లేదు. నా సంసారాన్ని మామగారి పెత్తనానికి విడిచిపెట్టి ఒక్కడినే వెళ్లాను. అవకాశమున్నంతగా మెట్లెక్కేనన్న తృప్తితో తిరిగి హైదరాబాద్ వచ్చి గ్రూప్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించాను. ఆడపిల్లకు ఎత్తుకెత్తు అడిగిన కట్నమిచ్చి అల్లుణ్ణి కొనగలమేమో కాని మా పెద్దవాడే సమస్యగా మిగిలాడు. కొన్నాళ్లు చార్టర్డ్ అకౌంట్స్ చేస్తానని తాత్సారం చేశాడు. ఎమ్.బి.ఎ. అన్నాడు. దేంట్లోనూ ఏకాగ్రత లేదు. ఇంకా స్థిరపడలేదు.

ఆఫీసులో నా టేబుల్ మీద ఉన్న అటెండెన్స్ రిజిస్టర్లు ఏమీ తోచక చూస్తున్నాను. రవీంద్రనాథ్ అన్న పేరు కనపడింది. నా క్రిందనే ఉన్న ఒక విభాగానికి అధికారి. కొంత ఆనందాన్ని కలిగించింది. నన్ను తన పై ఉన్నతాధికారిగా చూశాక కనీసం తను ఎంత నష్టపోయాడో, జీవితాన్ని మరీ తేలిగ్గా తీసుకొంటే ఏం జరుగుతుందో తెలుసుకొంటాడన్న ఆలోచనే ఆ తృప్తికి కారణమేమో. అయితే అందరిపట్లా ఉన్నట్టే కటువుగా ఉండాలనుకొంటే నా మనసులో ఏదో గిలి. ఆఫీసులో అడుగుపెట్టినప్పటినుండీ ఎరిగినవాడు. అందుకని వాడి సెక్షన్ వేపు వెళ్లడం మానుకున్నాను. అయితే దేనికదే చెప్పాలి. వాడి పనిలో పెద్దగా తప్పు పట్టే అవకాశమే ఇచ్చేవాడు కాదు. నానుండి ఎలాటి వెసులుబాటు ఆశించేలా కనబడలేదు. ఎన్నడైనా ఎదురైతే అందరిలా ఉండడమే తప్ప నువ్వు నాకు తెలియని వాడివా అన్నట్టు నిర్లిప్తంగా ఉండడం కానీ, వినయంతో చలిజ్వరం వచ్చినవాడిలా అయిపోవడం కానీ లేదు. అది చాలని తృప్తిపడ్డాను.

అయితే కొత్తగా వచ్చిన నా పై అధికారితో చిక్కొచ్చింది. వాడెవడో బోస్ అట. నేను ఎక్కువగా పర్యవేక్షణ పేరుతో ఊళ్లు తిరగడం వల్ల హెడ్ క్వార్టర్స్‌లో పనులు వెనకపడుతున్నాయని సణిగాడు.

ఒక మధ్యాహ్నం మా ఆఫీసులో క్లబ్ హాల్లో ఏదో జరుగుతోంది, దానిలో అకౌంటెంట్ జనరల్ పాల్గొంటున్నారని నా పి.ఎ. చెప్పడంతో నాకు అలాటివి బోరనిపించినా వెళ్లి నాకు చూపించిన తొలి వరుస కుర్చీలో కూర్చున్నాను. హాలంతా ఉదొత్తుల వాసన. ఆరోజు జనవరి పదిహేడో, పద్దెనిమిదో జ్ఞాపకం లేదు. వేదిక వెనక ఎవడో పంజాబీ గాయకుడి ఫోటో. దానికి పువ్వుల దండలు. ఎవరో పాడుతున్నారు. అవి తెలుగువి కావు. పూర్తిగా హిందీలాగా లేవు. కొన్ని ఉరుదూలా వినిపిస్తున్నాయి కూడా. ఒకడు అదేదో తబలానో, మృదంగమో వాయిస్తున్నాడు. ఒకడు హార్మోనీ పెట్టె పట్టుకున్నాడు. అందులో ఏ.జీ. ప్రక్కనే ఉన్నవాడు రవి అని చూశాక ఆశ్చర్యపోయాను. బోస్ కూడా పసిపిల్లడిలాగా ఊగిపోతూ మబ్బులురిమినట్లు పాడుతున్నాడు. రవి పాట పాడి ఆపగానే ఎ.జి. వెన్నుతట్టి అభినందించడం, హాలంతా ఒకటే చప్పట్ల గోల. ఇలాటివి చౌకబారు గిమ్మిక్స్ కాకపోతే ఏమిటి ? ఆఫీసులో క్రమశిక్షణ ఎలా ఏడుస్తుంది. ఎ.జి. బెంగాలీవాడు. వీడేమో అనకాపల్లివాడు. ఆ ఫోటోలో వాడేమో ఎక్కడో జలంధర్‌లో పుట్టి చచ్చాడట. కలకత్తా సినిమాల్లో వేసేడట. రెండుగంటలయి, ఆ గోల ఆగడమే తడవుగా ఎ.జీ.ని పలకరించి బయటపడ్డాను. తర్వాత కొన్ని రోజులకే ఏదో ప్రమోషన్ అని ఎ.జి. ఢిల్లీకి వెళ్లిపోవడంతో నాకు ఆఫీసులో ఇబ్బంది తగ్గి నిట్టూర్చాను. అంతేకాదు. రవి ముందుగానే కోరి పదవీ విరమణకి కాగితం పెట్టుకొని నిష్క్రమించడంతో వాడి మొహం కూడా ఆఫీసులో కనపడలేదు.

దీపం ఆరేముందే ఇల్లు చక్కపెట్టుకోవాలంటారు. నేనూ రిటైర్ అయ్యేలోగా జాగ్రత్త పడాలని ఎక్కువగా పర్యవేక్షణ కోసం ఊళ్లూ తరచూ తిరుగుతున్నాను. నిజామాబాద్‌లో ఆడిట్ పార్టీలున్నాయి. రెండు రోజులు ఉండాలని వెళ్లాను. ఒక సాయంత్రం క్లబ్బులో ఏదో కార్యక్రమం ఉంది. చిన్నపిల్లలు పాల్గొంటున్నారు, ప్రోత్సహించాలి అని నన్ను బలవంతంగా తీసుకొని వెళ్లారు. నావెంట ఆడిట్ ఆఫీసర్

వచ్చి కుడి చేతివేపు తొలి వరుసలోనే కూర్చున్నాడు. ఎడమవేపు మేము ఆడిట్ చేస్తున్న ఆఫీసులోని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కూర్చున్నాడు. పన్నెండేళ్ల అమ్మాయి పాటలు పాడుతోంది. బాలల దినమట. తొమ్మిదేళ్ల కుర్రవాడు అనుకుంటాను పెదిమలు రెండూ బిగించి, ఆపకుండా తబలా వాయిస్తున్నాడు. హాలంతా వాళ్లని ప్రోత్సహిస్తూ పాటపాటకీ చప్పట్లు కొడుతున్నారు. స్టేజి ఎక్కే మెట్ల కిందనే ఒక వారగా నాలుగు కుర్చీలు వేసి ఉన్నాయి. పాడుతున్న పిల్లవేపు చూస్తూ ఉన్నవాడు రవీంద్రనాథ్ కాడు కదా అని చూశాను. పల్చబడిన తెల్లని వెండి వెంట్రుకలు ఫాన్ గాలికి రేగుతున్నాయి. తెల్లని ఆహారము, అడ్డపంచె, హవాయి చెప్పులూ రవికి అలవాటైన వేషంకాదు మరి. పిల్లల కార్యక్రమం పూర్తయి తెర పడి కొంత విరామం ఇవ్వగానే ఆ ఇద్దరు పిల్లలూ హుషారుగా పరుగెత్తుకు వెళ్లి ఆ ముసలాడికి చెరోవేపూ చనువుగా చేరిపోయారు. వాళ్లని దగ్గరగా తీసుకున్నవాడు తృప్తిగా కళ్లు మూసుకున్నాడు.

వాడు రవీంద్రనాథ్ అనడానికి ఏ సందేహమూ లేదు. ఆ చూపు నాకు బాగా పరిచయమే. రామరామా ! వీడి పిచ్చికూలా ! ఆ పిచ్చి కాస్తా మనవలకి కూడా అంటించేశాడన్నమాట ! నాతో సరిగ్గా ఉద్యోగంలో చేరినవాడు నాతో మెట్లన్నీ ఎక్కవలసినవాడు ఎంత వెనకపడిపోయాడో, ఎంత నష్టపోయాడో, ఎప్పుడైనా ఆలోచించి ఉంటాడా ? అన్న సందేహంతో అలా ఉండిపోయాను.

నేను ప్రత్యేకించి లేచి వెళ్లి పలకరిస్తే తప్ప వాడు ఈ ఆఫీసర్ల మధ్య నన్ను గుర్తించే అవకాశం తక్కువే. ఇబ్బంది పెట్టడం ఇబ్బంది పడడం ఎందుకని మౌనంగా ఉండిపోయాను. పాపం ! రవి !

✣ ✣ ✣

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 10 అక్టోబరు, 2003*

✣ ✣ ✣